# "ఏమనుకున్నా సరే"

నాకు భావకవిత్వాలంటే మహాకోపం, దానికి తగ్గట్టు నాకు భావకవిత్వం చెప్పే స్నేహితుడొకడున్నాడు. ఒకరోజున ఆస్నేహితుడు ఒకచిన్న పద్యం రాశానని తీసుకొచ్చాడు. ఐని మరీ కేకలెడతాను గాని వినిపించుకోకుండా మొండివాదనలోకి దిగను. ఎందుకంటే, భావకవిత్వాలలో కూడా భావమున్న కవిత్వమక్కడక్కడ అరుదుగా కనబడుతూవుంటుంది. నా స్వభావం బాగా ఎరుగుండటంవల్లనే మావాడు నాదగ్గరకు తీసుకురాగలిగాడు. "ఏమోయి, టాగూరు! ఏంపని మీ దొచ్చావు? ఏమైనా కొత్తభావా లుద్భవించాయా యేమిటి? మహోవుత్సాహంగా వచ్చావు?" అన్నాను. మావాడు చిన్నస్మైలింగు (smiling) చేసి తల వేలేసు కూర్చున్నాడు.

స్నేహి—నే నొక చిన్నపద్యం రాశానోయి! అది చూపిద్దామని వచ్చా. "అయితే చదువు" అన్నాను. కాని నాకు వళ్లు మండుతోంది. పాండిత్యం లేనివాళ్లందరు భావకవు లయ్యారని.

స్నేహి—ఇదుగో చదువుతున్నా వినూ.

ఆగభీరనిశా స్నిగ్ధ వీచికాభ్రపటలి డాగి
భావకవికుమారహృదయ కుహర మేరుశిఖరి దూగి
ప్రణయ పవనహారిణమృదులగీతికలను దొప్పదోగి
మధురతర సుగానడోల మాయమైతె సుందరీ!...

*          *          *          *          *

కటికిచీకట్లు నాల్గువైపుల గ్రమ్ముకొనిరొ
చుక్క యొక్కటిమాత్రము మిన్కుమిన్కుమనుచు
నాహృదయసీమ మొలచిన యాశాలతాంత మనగ
మెరయుచున్నది.........

*          *          *          *          *

నాతి, నీయుదాసీన ప్రఘాతంబువలన
శకలశకలంబులైన నాగుండియల్
మరల నీవు నీదుప్రణయౌషధంబుచేత
నొకటిగా చేయవా?.........

*          *          *          *          *

"నాయనా, దీన్నేవృత్త మంటారు? ఇలాంటి గణాలు ఏ అప్పకవీయంలోనూ చూడలేదే! యతీ, ప్రాసా, ఏ అర్ధాన్నం అక్కర్లేదా ఏఁవిటి నాయనా! మాట్లాడవు" అన్నాను.

స్నేహి—భావం చూడవోయి. గణమో గణమో అని గందరగోళపడతా వేమిటి?

"అర్ధాన్నం. గణయతిప్రాసలు లేనిదే కవిత్వమేమిటి? ఇక అర్థమంటావూ. కరిమ్రింగిన వెలగపండు నెందుకూ కొట్టడం, దాల్లో యేఁవైనా వుంటేగా తినడానికి? అస లిదేవృత్తమో చెపుదూ!"

స్నేహి—ఆవృత్తాలూ గిత్తాలూ ఎవడి క్కావాలి. స్వారస్యం ప్రధానంగాని యేవృత్తమైతే నేం? చెవలకి హాయిగా వుండటానికి కర్ణాటకరాగాల్లో హిందూస్థానీస్వరా లెన్ని వేయటం లేదు! సుఖమా లేక శాస్త్రమా మనకు కావలసింది?

"ఏఁవిటి నాయనా, నీపద్యంలో వున్న సుఖం? ముక్కు తిమ్మన్నలాటి మహాకవులంతా ముద్దులు మూటగట్టేటట్టు పద్యాలు రాస్తే అవన్ని మట్టిగొట్టుకు పోతున్నాయీ! నేటికాలానికి కావ్యకన్యక నేడిపించటానికి మీరు బయల్దేరారా ప్రబుద్ధులు! హోరున ఏడుస్తూందే మీబాధ పడలేక! ఏదో కవి ననిపించుకుందామనేనా నీసరదా? ఇన్ని మేగజైను (Magazines) లుంటే దేల్లోనైనా ఏమూలనో పడకపోతుందా అనా నీ దిలాసా? ఇలా వరసపెట్టి వంద పేజీల పుస్తకం రాస్తే ఎవరు బాధపడుతారు, మాకొద్దు బాబూ అని పుస్తకం పారేసి పరుగెత్తుతారు కాని?"

స్నేహి—ఏఁవిటయ్యా! అలా అంటావు. మూడు రోజులు నిద్రాహారాలు మానుకొని ఆలోచించి రాస్తేను?"

"నాయనా! ఎందు కంత కష్టపట్టం. ఈ భావ తరంగాలకోసమేనా మూడురోజులు ఆలోచించటం! అయితే దాని కర్థ మేమిటోకూడా సెలవిద్దూ, విని సంతోషిస్తాను."

స్నేహి—ఇప్పుడు దాని కర్థఁవంతా ఎలా తేలుతుంది? దాల్లో చాలా గాఢుంది. దాని అర్థం, రాసిన కవి ఎన్నడూ చెప్పడు. ఎవరంతట వాళ్లర్థం చేసుకోవలసిందే. అయినా అంత సులభంగా అందరికీ అర్థమూ కాదు. దాన్నర్థంచేసుకోడానికి రసగ్రహణశక్తి ఎంతుండాలి! ఆశక్తి ఎంత వుంటే అంత అర్థమవుతూ వుంటుంది.

"పైగా యిదొకటా! నాలు గర్థంలేని ముక్కలేవో రాసి నాకు రసగ్రహణశక్తి లేదంటావూ? నీ మొహం. దాల్లో ఏఁవుంది? హరిణమృదుల గీతిక లేమిటి? ఆనా తెవరంట? ఒకటిగా చేయడ మేఁవిటి నీతలకాయ! ఒకదాని కొక టేమన్నా పొసుగుతోందీ."

స్నేహి—నీ కంత అలాటప్పగా కనబడుతోందేం! అసలు కవైతేనే గాని దీని అర్థం గ్రహించలేడు. భట్టుమూర్తి గనక వింటే బావురు మనవలసిందే! తిక్కన తిరిగి చూడకుండా పారిపోడూ? ముక్కుతిమ్మన్నకు ముచ్చెమటలు పట్టకపోనా? నీవేమో మహా ఆక్షేపిస్తున్నావు. అలాంటి కవుల్నందరినీ గజగజలాడించే కవిత్వం భావకవిత్వమంటేను. తెలిసిందా! ఇది నాచురల్ (Natural) కవిత్వం. గణయతిప్రాసలతో అష్టదిగ్బంధనం చేసి ఆర్టిఫిషల్ (Artificial) గా తయారు చేసింది మునపటివాళ్ల కవిత్వం. వాటంతట అవే నోటివెంబడి వుప్పొంగుతాయి భావాలు — ఈకవిత్వంలో.

"నురగల్లాగనా?" అని నే ననేసరికి మావాడు ప్రళయకాలరుద్రుడులాగా లేవడానికి సిద్ధమయ్యాడు.

"ఆగవోయి—అలా కంగారుపడతా వేమిటి? దీల్లో వున్న మంచిచెడ్డలు చెప్పమనేగా నీవు నాదగ్గిరికి తీసుకొచ్చింది? విమర్శిస్తూంటే కోప మెందుకు నీకు? అయితే, వాళ్ల ఖర్మం కాల మునపటికవు లంతా ఇది వినేసరికి నువ్వు చెప్పిన స్థితి కొస్తా రంటావు? ఒక విధంగా వస్తే రావచ్చు. 'ఇదేం కవిత్వంరా బాబూ' అని వాళ్లుకూడా హడిలిపోతా రంటానికి సందేహం లేదు. నాయనా, ఏఁమిటో రసంరస మంటావు! ఏంరసంవుంది దీల్లో? నీరసం తప్ప నా కేం కనిపించటంలేదు. అయితే బాబూ, మీవంటి ప్రబుద్ధులు తిక్కనకాలములోకూడా వుంటే వుండొచ్చు. ఈమిడిమిడి కవిత్వం నిలిచేది కాదు కనుక అప్పుడే అంతరించి, శుభ్రమైనవే వో నిల్చాయి. అదీగాక ఇప్పుడు ప్రతిఅడ్డమైనవాడికీ కవి ననిపించుకోవాలని సరదా. అంచేత ఏవెఱ్ఱిమొఱ్ఱి వ్యాసమో, ఏభావకవిత్వపు పద్యాలో మొదలెట్టడం! ఏముంది! కాగితం కలం చల్లగా వుంటేసరి. అవును కాని, ఇకెప్పుడూ నాదగ్గిరికి తీసుకురాకు; మీకవిత్వమంటే నాకు వళ్లు మండుతోంది."

స్నేహి—(ఆమట్టున లేచి) నీదగ్గిరికి నే నెన్నడూ తీసుకురాను. ఈపద్యం అర్థమయ్యే మొహం కాదు నీది. కనుక నాకు శెలవు బాబూ! మాకవిత్వాని కున్న ప్రతిష్ఠకూడా చెడకొడతావు.

"ప్రతిష్ఠఅంటూ వొక టుంటేగా చెడగొట్టడానికి" అని నే నంటూండగానే వాడు కోప మొచ్చి లేచి పోయాడు. పీడ వదిలిం దనుకొని మనస్సు చికాగ్గా వుండటంచేత పక్కను ఒక మేగజైను వుంటే తీసి ఒకటిరెండు పేజీలు తిరగేసి మూసేటప్పటికి, అక్కడా యిలాంటి పద్యాలే ప్రత్యక్షమైనాయి. నేను లేచినవేళ మంచిదికాదు. లేకపోతే యేమి టీగోల! తల మంటెత్తుకొస్తోం దనుకొన్నాను. కాని నవ్వుకూడా వచ్చింది. వక్కసారిగా కొంతమంది మనుష్యులకు మతి చలించిం దనుకున్నాను. నిద్ర రావటంచేత పక్కమీద పడుకున్నా.

* * * *

నేనూ నాస్నేహితుడూ అరణ్యప్రాంతాలకేసి వెళ్లాము. అక్కడ చిన్నకొం డొక టుంది. ఎక్కడ నుంచో కొంచె మేడుపు వినిపిస్తోంది. ఎక్కడా? అని

పైకి చూశాము. కాని మాకేఁవీ కనపడలేదు. పోనీ చూద్దామని మెల్లిగా యిద్దరమూ కొండెక్కాము. చూసేసరికి చక్కని పిల్ల పదహారేళ్లది కూచుని యేక ధారగా శోకిస్తోంది. వొళ్లో పుస్తకాలుమాత్రం యేవో వున్నాయి. దగ్గిరి కెళ్లి "యేఁవమ్మా! అలా ఏడుస్తున్నావు"అని అడిగాం.

"నాయనా, మీ కెందుకు నాజోలి! నే చెపితే మాత్రం చెప్పినట్లు చేసేవాళ్లున్నారుగనుకనా?" అన్నది.

"ఏఁవిటమ్మా నీకొచ్చిన కష్టం? చెప్పమ్మా, సాధ్యఁవైతే ప్రయత్నిస్తామూ" అన్నాడు మావాడు.

"నాయనా! ఇప్పుడొకకొత్తకవులు బయలుదేరారు నాప్రాణానికి! నాఅవయవఖండనం చేస్తున్నారు. వాళ్లకు నే నేమపకారం చేశాను? వాళ్లకేసి నే నెన్నడూ చూడనైనా లేదే! నేటికాలాని కిలాంటి కవులు బయలుదేరారుగదా అని విచారంగా వుంది. ఏవో నాలుగుముక్కలు ఇష్టమొచ్చినట్లు వ్రాస్తే నిండుతుం దనుకుంటున్నారు! ఇలాంటివి రాయొద్దని చెప్పి బోధించేవా డెవడూ లేకుండాపోయాడు. యతీ లేదు. ప్రాసా లేదు. గణమూ లేదు. చివరికి దానికి పేరు కూడా లేదు. అన్నీ సలక్షణంగాఉంటే నా కానందం గాని, అన్నీ తీసేస్తే నాకు విచారం కాకేమిటి" అంది.

"నాకూ అలాంటికవులంటే కోప మేనమ్మా. ఏంజెయ్యను తల్లీ! చెపితే వినిపించుకునేవాళ్లెవరూ లేరు. అమ్మా! మీవొళ్లో ఆపుస్తకా లేఁవిటి" అని నే నడిగాను.

"ఇది భారతం, రెండఁది భాగవతం. వీ రింత చక్కగా రాసి నన్ను మన్ననచేస్తే ఈస్వర్ణయుగంలో, తోకపీకుడుకవిత్వం రాసేవాళ్లు పుట్టారుగదా అని ఈ పుస్తకాలు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాను" అంది. "అలాగా అమ్మా!"అని యిద్దరం సాష్టాంగదండ ప్రణామం చేశాము.

"తల్లీ! వీడుకూడా ఆతోకపీకుడుకవిత్వంగాడే" అని చూపించాను. మా 'టాగూరు'కు ప్రాణాలు లేవు; గజగజ వణికిపోతున్నాడు. నేనే, పడిపోతాడేమోనని పట్టుకు నుంచున్నా. అప్పుడు ఆవిడ కళ్లెత్తి చూసింది, చూశేటప్పటికి మరింత హెచ్చయింది మావాడికి భయం. కాని ఆవిడ మళ్లీ ఒకమారు చూసింది. అప్పుడు ఆసోగలైన కళ్లల్లోంచి రెండు నీటిబిందువులు జారి పడ్డాయి. వెంటనే "కాటుకకంటినీరు" అన్నపద్యం జ్ఞాపకంవచ్చింది నాకు. "నువ్వొక్కడవు మానేసినా మానేయడమే. ఆతల్లి అల్లా విలపిస్తోంది, ఇక నే నెన్నడూ వచ్చీరాని కవిత్వం చెప్పనని చెంప లేసుకో" అన్నాను మావాడితో. ఆవిడకూడా అంగీకార సూచకంగా తల పంకించింది.

"వేసుకో వేమిరా చెంపలు" అని గద్దించాను. మావాడు చేతులు నలుపుకుంటూ—

"అయితే, నేను కవి ననిపించుకోటం ఎలాగ?" అన్నాడు మెల్లిగా నసుగుతూ.

"ఒరే నీ కేమన్నా మతి పోయిందా ఏఁవిటి? నే చెబుతూంటే వినిపించుకోవేం? మరేం పరవాలేదు. నీ పద్యరత్నాలు వచ్చి దేశాన్నేమీ ఉద్ధరించటం లేదు. నీఅభావకవిత్వం ఫెదర్‌వెయిట్ పేపరు (Feather-weight Paper) మీద పేజీకి రెండున్నరపంక్తులు పెట్టి గ్రంథాలు అచ్చువేయించిపారేస్తేఎవడుకొంటాడు, అసలు డబ్బులే కేడుస్తుంటే దేశం? కనుక నే చెప్పినట్లు చెయ్యి" అన్నాను. మావాడు సందేహించటం మొదలు పెట్టాడు. నాకు వళ్లు మండుకొచ్చింది.

"ఏఁవిట్రా ఆమొండివేషం?" అని గట్టిగా చెవి పట్టుకొని మెలిపెట్టాను. ఎందుచేతనో చప్పున మెళుకు వొచ్చింది? చూస్తినిగదా ఆపట్టుకున్నది మావాడి చెవి కాదు నాతొడే! బిగించి పట్టివుంది. మంటెల్లాతిగ్గుతుందీ! ఎఱ్ఱగా కందిపోయింది. నవ్వూ వచ్చింది; ఏడుపూ వచ్చింది. మెల్లిగా లేచెళ్లి బల్లమీద వేసలై నుంటే రాసుకొన్నాను. అంత వళ్లు తెలియని ఉద్రేకం ఉండ కూడదు. ఎప్పటికైనా ప్రమాద మనుకున్నాను. నాకల భావకవులకి తెలియపరిస్తే వుపయోగ మేమైనా వుంటుందేమోనని వెఱ్ఱినమ్మకంతో బయలుపెట్టాను.

ఈమాత్రానికి మానేసేవా డెవడు? నేనే ఈవిషయమై ఉపన్యాసా లివ్వదలుచుకున్నాను. కొద్దిరోజుల్లో బయల్దేరుతాను. ఆసరస్వతీదేవి అల్లా ఏడుస్తుంటే నామనస్సు నీరై పోయింది. నాకొచ్చిన కలబాటి కల ఇంకోడి కెవడికొచ్చినా వాడికి హృదయం-హృదయమంటే పాషాణ హృదయంకాదు, దయార్ద్రహృదయం- అంటూ వుంటే యీవిషయమై గట్టిగా ప్రయత్నించక మానడు. ఆకల నాకే వచ్చింది కనుక గట్టిగ ప్రయత్నించదలుచుకొన్నాను. మీ కెవరికన్నా అబ్జెక్షన్ (Objection) వుంటే తెలియబరచకోరుతాను. ఇంకా దాని విషయమాలోచిస్తో కూర్చున్నా. అంతట్లో వెనుకనుంచి నవ్వు వినపడ్డది. తిరిగి చూసేసరికి నాభార్య కాఫీకప్పు తీసుకొచ్చి నిల్చుంది.

"ఏం, భావకవిలా గలా ఆలోచిస్తున్నారు? కవితాప్రపంచంలో వున్నారా ఏమిటి?" అంది.

"ఏ మలా అంటున్నావు? నీకూ నవ్వులాట గానే వుందా భావకవులంటే?" అన్నాను.

"నీకూ అని వత్తి పలుకుతున్నారు. నేను మనిషిని కా ననుకున్నారా యేమిటి?" అంది.

---

## బిచ్చగాఁడు

వడ్లమూడి వేంకటరత్నముగారు

వేకువ నిద్ర మేలుకొని వెంటఁ బరున్న ప్రియాంగనామణిన్
సోఁకున మేలుకొల్పి కలజోలెలు నెంగిలిచట్లు చింపివా
కోకలకావడిన్ గదిమి కుట్టల మూఁపునఁ జంక నాలితోఁ
గైకొని యాగతిన్ నకనకంబడి పాఱుదు వేమి యెంచితో.

నీతో నున్న జనంబు మేలుకొనినన్ నీకంటె ముం దేగి యా
యాతల్లుల్ దయఁ బెట్టు బిచ్చములు తామే కొందు రంచేమొ నీ
శాతాంగిన్ బసిపాపల న్నయనకంజాతాసులం గూడి యీ
ప్రాతఃకాలమ పర్వులెత్తెద వహో ప్రారబ్ధసంరంభముల్.

దైవవశంబునం దెరువు దాఁటఁగఁ దోడగు వీనిమీఁద నీ
కీవిధి నోర్వలేమి యయె యిర్వురు నేకపథానువర్తన
ప్రావనతీర్థు లిర్వురు నిరంతనితాంత దరిద్రతా ప్రియం
భావుకమూర్తు; లైన నినుఁ బల్కఁగ నేమిఫలంబు సెప్పుమా!

నీకై యాత్మఁ దపించి కోరి కవిసెన్ నిర్నిద్రతారుణ్యరే
ఖై కాకంపితలోక దైన్యసతి యారా యెంత ప్రేమంబొ! నీ
వో! కాలంబడుదాని కాదరువు నీ నూహించి నిస్పత్త్వతా
వ్యాకోచంబగు సంతతిం గనెద వాహా యెంత యౌదార్యమో!